# శ్రీ సుబ్రహ్మణ్యమహర్షి స్తవరాజము



ర చ యి త లు :

శ్రీ సుబ్రహ్మణ్యమహర్షి ప్రియశిష్యులు
ఉభయభాషా ప్రవీణ
లింగాల సూర్యనారాయణ
మునుకుట్ల శేషాద్రిశాస్త్రి, B. E.

ద్ర వ్య దా త లు :

శ్రీ మండ వెంకట రమణయ్యగారు
శ్రీ లింగాల సూర్యనారాయణగారి భార్య సత్యవతి

Scanned with CamScanner

శ్రీ ర స్తు.

శ్రీ రామచంద్ర గ్రంథమాల - సప్తదశ పుష్పము

# శ్రీ సుబ్రహ్మణ్యమహర్షి స్తవరాజము



రచయితలు :

శ్రీ సుబ్రహ్మణ్యమహర్షి ప్రియశిష్యులు

ఉభయభాషా ప్రవీణ

లింగాల సూర్యనారాయణ

మునుకుట్ల శేషాద్రిశాస్త్రి, B. E.

ద్రవ్యదాతలు :

శ్రీ మండ వెంకట రమణయ్యగారు

శ్రీ లింగాల సూర్యనారాయణగారి భార్య సత్యవతి

వెల 0-25 పై.

Scanned with CamScanner

అన్ని హక్కులు
శ్రీ లింగాల సూర్యనారాయణగారివి

ద్రవ్యదాతలు

శ్రీ మండ వెంకటరమణయ్యగారు P. W. D. రిటైర్డు హెడ్ క్లర్కు — రు. 50–00

శ్రీ లింగాల సూర్యనారాయణగారి భార్య సత్యవతి — రు. 25–00

మొదటి కూర్పు 500

గ్రంథములు వలయువారు :

ఉభయభాషా ప్రవీణ

లింగాల సూర్యనారాయణ

గ్రేడు I తెలుగు పండితుడు, వివేకానంద హైస్కూలు

నారాయణపురం P. O. Via. చేబ్రోలు, ప॥ గో॥ జిల్లా.

మరియు

విద్వాన్. మునుకుట్ల వెంకట వాసుదేవదీక్షితులు

గ్రేడు I తెలుగు పండితుడు, P. H. స్కూలు

దువ్వ P. O. Via. తాడేపల్లిగూడెం. ప॥ గో॥ జిల్లా.

Scanned with CamScanner

ఓం నమో భగవతే సుబ్రహ్మణ్య మహాదేవాయ

# విజ్ఞప్తి

మా గురుచక్రవర్తి శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి మానవరూపము దాల్చిన యుపనిషత్సారము. శ్రీ గురుపత్ని బాపనాంబగారి యపార కరుణచే తపోరాశియగు శ్రీ మహర్షులవారి దివ్య పాదారవింద సేవ విక్రమ సం॥ర పుష్య శుద్ధ పంచమి (2-1-1941 తేదీ) గురువారము నుంచి నాకు లభించినది. కన్న తల్లిదండ్రులైనను చూపజాలని యపార ప్రేమతో నన్నాదరించి శ్రీ గురుదంపతులు నాకు విజ్ఞానభిక్ష నొసంగి యుండిరి.

శ్రీ వారి బోధలచే శిలాప్రతిమలు గూడ ద్రవించును. శ్రీమహర్షి చెంత నేను సేవ చేయుచున్నపుడు బయలువెడలిన భావ తరంగములే యిందలి పద్యములు.

శ్రీ గురుదంపతుల పాదారవిందములకు ప్రణామ కుసుమాంజలి.

ఈ గ్రంథ ముద్రణమునకై విరాళమిచ్చి మా యుద్యమమునకు దోహద మొసగుచున్న శ్రీ మండ వెంకట రమణయ్యగారికి మా కృతజ్ఞతాభివందనములు.

శ్రీరామక్షేత్రము
మహేంద్రవాడ
25-12-1937.

ఇట్లు గురుచరణ సేవకుడు
ఉభయభాషా ప్రవీణ
లింగాల సూర్యనారాయణ

# శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి స్తవరాజము

## శ్రీ విశ్వనాథ గురుస్తుతి.

ఉ॥ శ్రీపతి రూపుఁడై విబుధ - సేవితుఁడై పరిపూర్ణ తత్త్వ సం
స్థాపన శీలుఁడై పరమ - సాధుజనార్చిత పాదపద్ముఁడై
చూపుల మధ్యదేశమున - సూక్ష్మ విధంబున నుండి వెల్గు శ్రీ
పాపయ విశ్వనాథగురుఁ - బ్రస్తుతిఁ జేతు నపారభక్తితోన్॥ 1

## అధ్యాత్మ గురు స్తుతి.

సీ॥ శ్రీ గణాధీశుని - స్థిరభక్తితోఁ గొల్చి
చతురాననునిమది - సన్నుతించి
శ్రీ విష్ణుదేవుని - సేవలు గావించి
పార్వతీనాథునిఁ - బ్రస్తుతించి
జీవాత్ముఁడై నట్టి - శ్రీరాము నర్చించి
శ్రీ సదాశివదేవుఁ - జేరిగొలిచి
నమ్మికగా గురు - నారాయణుని మ్రొక్కి
హంస స్వరూపుని - నభినుతించి

గీ॥ వారిభార్యల నందఱ - వరుస మ్రొక్కి
యఖిల రూపములై యున్న - యాత్మఁగొలిచి
అచలపరవాసుదేవుని - నభినుతించి
చెప్పఁ బూనితి గురుకృప - చేత నేను॥ 2

# శ్రీ యాజ్ఞవల్క్య మహర్షి స్తుతి.

సీ॥ బ్రహ్మరాత సునంద - వరదంపతుల గర్భ
రత్నమై యే ముని - రాజు వెలసె
తల్లి గర్భములోనె - తత్త్వసుజ్ఞానియై
యే మునిపుంగవుఁ - డేపుమీఱె
ముని సంఘములకెల్లఁ - దన ప్రజ్ఞఁ జూపింప
సూర్యుఁడై యే యోగి - శోభఁ జూపె
ద్వైతులై చెలరేగు - వైరి మౌనులనెల్ల
నద్వైతబోధచే - నణచిమించె
గీ॥ అట్టి పరిపూర్ణ తత్త్వ బో - ధైక మణిని
నిర్వికార నిరంజన - నిష్కళంకు
దివ్యసుందర విగ్రహ - దీప్తిమాని
యాజ్ఞవల్క్యునిఁ గొలుతు లో - కైక గురుని॥ 3

సీ॥ నిర్గుణాతీతాయ - నిగమాంత వేద్యాయ
అచలాబ్ధిరూప తు - భ్యం నమోఽస్తు
పాలిత శిష్యాయ - పరిపూర్ణ రూపాయ
ఆశ్రితపోష ! తు - భ్యం నమోఽస్తు
మునిజన సేవ్యాయ - మోక్షప్రదానాయ
ఆచార్యవర్య ! తు - భ్యం నమోఽస్తు
అనుభవాతీతాయ - ఆనంద రహితాయ
భవపాశనాశ ! తు - భ్యం నమోఽస్తు
గీ॥ ఆదిమధ్యాంత రహిత ! బ్ర - హ్మాదివినుత !
శుద్ధ నిర్గుణ పరమాత్మ ! - సూరి వినుత !
పరమ పావనమూర్తి ! మాం - పాహిపాహి !
అఖిల మౌనీంద్ర వందిత ! - యాజ్ఞవల్క్య॥ 4

Scanned with CamScanner

## గురుపత్ని శ్రీ బాపాంబాస్తుతి.

సీ॥ పతిపాద పద్మంబు - లతి పూర్ణభక్తితో
సేవించు పరమ సు - శీల యీమె
హరినామ మంత్రజ - పాభ్యాస తృప్తితోఁ
గాలంబు గడపెడి - కాంత యీమె
అర్ధరాత్రులనైన - నాదరాశయముతో
నతిథులఁగాచు పు - ణ్యాత్మ యీమె
పంచభక్ష్యాన్నం పుఁ - బరమాన్నముల తోఁడ
సంతర్పణలఁ జేయు - సాధ్వి యీమె

గీ॥ నీతి మార్గంబు దప్పని - నెలఁత యీమె
భక్తులను ప్రేమఁ జూచెడు - పడఁతి యీమె
ఇట్టి గురుపత్ని బాపాంబ - నిలను గనుట
జన్మరహితంబుగాదె సం - సారులకును॥ 5

## శ్రీ సుబ్రహ్మణ్యమహర్షి స్తుతి.

శ్లో॥ శ్రీ కల్యాణ గుణాన్వితం శ్రుతి శిర స్సీమంతినీ సేవితం
వేదాంతార్ధ విశేషరత్న ధనినం కైవల్య దీక్షాపరం
భక్తాభీష్ట వరప్రదాన నిపుణం శ్రీ శంకరస్వామినం
సుబ్రహ్మణ్య గురూత్తమం కవివరం సేవే ముదాహం సదా॥ 6

శ్లో॥ భస్మోద్భాసిత దేహకాంతి మమలం సుస్మేర వక్త్రాంబుజం
చిన్ముద్రాభయహస్త దీప్తమనిశం భక్తౌఘసంసేవితం
బాపాంబా సహితం ప్రభావ కలితం శ్రీ శంకరస్వామినం
సుబ్రహ్మణ్య గురూత్తమం హృదిముదా సేవే సదా పావనం॥ 7

శ్లో॥ అద్వైతామృత వృష్టి మేఘమచలం సంసారతాపాపహం
మోక్షేచ్ఛాయుత మానవామరతరుం యోగీంద్ర సంసేవితం
రామారాధన తత్పరం భవహరం శ్రీ శంకరస్వామినం
సుబ్రహ్మణ్య గురూత్తమం సురనుతం వందేముదాహం సదా॥ 8

స్రగ్ధర.

శ్లో॥ శ్రీమత్త్రై లింగదేశే ద్విజవరకలితే పూతవంశే సుజాతం
వేదాంతార్థప్రవీణం విగతభవభయం వీతరాగం సుశీలం
ద్వంద్వాతీతం బుధేశం మునిజననికరాగ్రేసరం జ్ఞానసారం
సుబ్రహ్మణ్యం సుధీరం గురువర మమలం ప్రార్థయే పుణ్యమూర్తిం॥

పంచచామరమ్.

శ్లో॥ అఖండ పండితాళి నిత్య పూజితాంఘ్రి పంకజం
సురేంద్ర బృంద మౌళి రత్నదీప్తి శోభితాంగకం
ముముక్షు భక్త పాలితాఖిలాగమాంత మోదితం
భజామి మోక్షసాధనేఽద్య సుబ్బరాడ్గురుం ముదా॥

శ్లో॥ స్థితప్రజ్ఞ స్వరూపాయ । భక్తోద్ధరణ హేతవే
బ్రహ్మ వంశాబ్ధి సోమాయ । సుబ్రహ్మణ్య నమోఽస్తుతే॥ 10

సీ॥ భక్తజాలంబను - బ్రహ్మాండమును జేయు
నబ్జభవుండని - యభినుతింతు
సంసారబంధంబు - నడలింపఁగాఁ జేయు
విష్ణుండవని నిన్ను - వినుతిఁ జేతు
రామనామార్థంబు - రమ్యంబుగాఁ దెల్పు
శంకరుఁడని నిన్ను - సన్నుతింతు
సర్వంబునందున - సాక్షియై వెలుఁగొందు
పరమాత్మ యని నిన్ను - భక్తిఁ గొలుతు

గీ॥ దారిగానని వారల - దరిని జేర్చ
మార్గమిదియని చూపిన - మహిత విభుఁడ
నిన్ను నుతియింప నేనెంత - నిగమవినుత
సరసగుణధామ! పద్యము - చాల దింక॥ 11

గీ॥ రామతారక సామ్రాజ్య - రాజచంద్ర
పూలు చాలవు నిన్ను నేఁ - బూజసేయ
మానసిక పూజ మాత్రము - మానవెపుడు
కానఁబరిపూర్ణ దయతోడఁ గావుమయ్య॥ 12

సీ॥ సుందరకాండనే - సూటిగాఁ బఠియింప
నంజనీసుతుఁడవై - యలరినావు
అంజనీసుతుని నే - నర్చించి భావింప
దక్షిణామూర్తివై - తనరినావు
దక్షిణామూర్తి నే - ధ్యానించి సేవింప
శ్రీరామమూర్తివై - చెలఁగినావు
శ్రీరామమూర్తి నే - స్థిరముగాఁ బూజింప
వ్యాపక బ్రహ్మమై - వఱలినావు
గీ॥ ఇట్టి రూపంబు లెన్నియో - యింపుతోడఁ
జూపజాలిన యోగీంద్ర - సూరివీవె
ఏమి చెప్పుదు నీదివ్య - నామమహిమ
పరమపుణ్య సుబ్రహ్మణ్య - గురువరేణ్య॥ 13

సీ॥ తల్లి గర్భములోనె - తరియించు మార్గమె
య్యదియంచు మదిలోన - నలరువాఁడు
జననమందిన దాది - చక్రి చింతనచేత
దేహంబు మఱచుచుఁ - దిరుగువాఁడు

ఐదేండ్ల లేఁబ్రాయ - మబ్బినంతనె రామ
కైంకర్యమునఁ బ్రొద్దు - గడపువాఁడు
వయసువచ్చిన దాది - వరతత్త్వబోధకై
యవధూతగుహలకు - నరుగువాఁడు

గీ॥ ప్రకృనసంటక గేస్తుఁడై - పరగువాఁడు
బోధసేయుచు బ్రహ్మాబ్ధి - మునుఁగువాడు
సూరివర్యుండు సుబ్బరా - ద్గురువరుండు
నాకు దొరకుట మిగుల పు - ణ్యంబుగాదె ॥ 14

సీ॥ ఎవ్వాని ముఖపద్మ - మీక్షింపఁ బలియైన
శాంతమే గతియని - సంచరించు
ఎవ్వానిబోధక - ర్ణేంద్రియంబులు సోకఁ
బ్రకృతిని గెలుచు స - ద్భక్తి యబ్బు
ఎవ్వాని పదరేణు - వీరేడు జగముల
పాపసంఘంబులఁ - బారఁదోలు
ఎవ్వాని సేవింప - నింద్రభోగికినైన
రాజ్యంబుపైన వి - రక్తి గలుగు

గీ॥ అట్టి మహనీయు రెడ్డివం - శాబ్ధిచంద్రు
బ్రహ్మవిద్యాస్వరూపు శ్రీ - భక్తవరదు
అఖిలమునివంద్యు సుబ్బరా - యాఖ్యగురుని
హృదయపీఠిని గొల్తు న - హీనభక్తి ॥ 15

సీ॥ ఫాలదేశాంబక - జ్వాలలో యనశిరో
జములెల్లఁ బీతవ - ర్ణమును దెలుప
దివ్యమంగళ ధవళ - దేహుఁడో యనఁ బూత
భస్మాంగరాగంబు - పరిఢవిల్లఁ

పన్నగాలంకార - పరితుష్టుఁ డోయనం
దులసిమాలలు మేన - వెలయుచుండ
శార్దూల మృదుచర్మ - సంప్రీతుఁ డోయనం
జిత్రాసనముపైనఁ జెలఁగుచుండ

గీ॥ తత్త్వమస్యాది వాక్య బో - ధనధనుండు
అపరశంకరమూర్తి యో - యనఁగనొప్పు
పరమపుణ్యు సుబ్రహ్మణ్యు - గురువరేణ్యు
నభినుతించెద లోకక - ల్యాణమునకు ॥ 16

సీ॥ హంసవాహనమెక్కి - యాడించుచుందు వీ
బ్రహ్మాండములఁ జేతి - బంతులట్లు
ఖగవాహనంబెక్కి - గాంచుచుందువి జగములఁ
బరమాణువులరీతి - పరమపురుష
గోపతిపై నెక్కి - కోపించుచుందు వీ
క్షుద్ర విశ్వంబుపై - రుద్రరూప
ప్రకృతి వాహనమెక్కి - పరికించుచుందు వీ
యాత్మ సంభవ విష - యాదులెల్ల

గీ॥ బ్రహ్మ విష్ణు మహేశుల - ప్రతిభగాంచి
నిర్గుణబ్రహ్మసాక్షివై - నెగడినావు
నీదు మహిమంబు నిజముగా - నిగమసమితి
తెల్పఁగాఁజాల దిసుమంత - దేశికేంద్ర ॥ 17

సీ॥ శిల పూజయేలని - చెప్పుమా యనివేడ
శివభావమదియంచుఁ - జెప్పినావు
శివభావమెట్లని - చేరిన్ గొలువంగ
సోహమే గతియని - చూపినావు

సోహంబు గ్రీడింపఁ - జో చెప్పటని వేద
నాత్మఁ జూపుచు శంక - లణఁచినావు
ఆత్మ జన్మింపంగ - నాధారమెవియన
నచల పరబ్రహ్మ - మనుచునాదు

గీ॥ సందియములెల్లఁ దెగటార్పఁ - జాలినావు
ఇట్టి క్రమబోధ బోధింప - నెవ్వఁడోపు
నీకె చెల్లెను జగతిలో - నిఖిలవంద్య
పరమపుణ్యా సుబ్రహ్మణ్య - గురువరేణ్య ॥ 18

సీ॥ సగుణమార్గంబులఁ - జక్కఁగా బోధించి
భగవంతుఁ జూపిన - ప్రభుడవీవె
నిర్గుణోపాసనా - నియమంబులను దెల్పి
యాత్మ తేజముఁ జూపు - హరివి నీవె
అచలమే సర్వలో - కాధారమని దెల్పి
మెప్పించి యొప్పించు - మేటివీవె
దృశ్యంబు లెల్లను - దృక్కుచే నణగించు
సూక్ష్మంబు దెల్పిన - సూరివీవె

గీ॥ అర్థరాత్రుల యందైన - నాదరమున
సందియములెల్లఁ దీర్చిన - సంయమీంద్ర
నీదు ఋణమెట్లు దీర్తునో - నిగమవినుత
పరమపుణ్యా సుబ్రహ్మణ్యా - గురువరేణ్య ॥ 19

సీ॥ దక్షిణామూర్త్యవ - తారమే గానిచోఁ
దత్త్వంబు బోధింపఁ - దగునె నీకు
కైలాసవాసివే - గాకుండినట్లైన
శ్రీరామ తత్త్వంబుఁ - జెప్పఁగలవె

వేదవేదాంగాది - వేత్తవే గానిచో
సప్రమాణప్రబోధ - సహజమగునె
బ్రహ్మవిద్యారూప - పరమాత్మ గానిచో
సచల లక్షణదెల్ప - నగునె నీకుఁ

గీ॥ పాపపంకాబ్ధి మునిగిన - వారికెల్ల
మోక్షపదవిచ్చి రక్షించు - మునివి నీవె
సకలయోగీంద్ర మునిగణ - సార్వభౌమ
పరమపుణ్యా సుబ్రహ్మణ్యా - గురువరేణ్యా ॥ 20

సీ॥ లోకజాలము మేను - లోన సృష్టించెడి
క్రమము దెల్పిన మహా - ఘనుఁడవీవె
అనుభవజ్ఞానాబ్ధి - హాయినొందెడి సూక్ష్మ
మార్గంబు దెల్పిన - మౌనివీవె
గురుకులవాసంబు - గురుకాల మహిమంబు
దయతోడఁ దెల్పిన - తండ్రివీవె
ఆర్యదర్పణమందు - నాత్మ చిత్రములెల్లఁ
జూపింపఁజాలిన - సూరివీవె

గీ॥ ప్రకృతి దోషంబు లించుక - సోకనీక
పరమపదమును జేర్చెడి - ప్రభుఁడవీవె
నిన్ను సేవించి పూజించు - నియతిగాంచు
భాగ్యమబ్బుట బహు తపః - ఫలముగాదె ॥ 21

సీ॥ ధారణా నియమ వి - ధానంబు బోధించి
దృశ్యంబు మాపిన - దృక్కువీవె
పంచపూజల గూఢ - భావంబు బోధించి
పరశివుఁ జూపిన - ప్రభుఁడవీవె

మానసార్చన మహా - మహిమల బోధించి
మదమడంచిన లోక - మాన్యుఁడీవె
అంతర్యయాగ ర - హస్యంబు బోధించి
తాపంబులడచిన - తండ్రివీవె

గీ॥ హంసతత్త్వంబు దెల్పిన - యాఢ్యుఁడీవె
పరమహంసను జేర్చిన - ప్రభుఁడవీవె
శుద్ధ నిర్గుణ పరమాత్మ - సూరివినుత
పరమపుణ్యా సుబ్రహ్మణ్యా - గురువరేణ్యా ॥ 22

సీ॥ కర్మకాండలలోని - మర్మమంతయుఁగూడ
బ్రహ్మ కర్మగఁ జెప్పు - ప్రభుడవీవె
స్నానసంధ్యాదుల - సారాంశమును దెల్పి
తాపాగ్ని నణఁచిన - తండ్రివీవె
క్షేత్రభావము దెల్పి - క్షేత్రజ్ఞు సూచించి
పంచభూతములణఁచు - పరముడీవె
క్షరమక్షరంబును - నిరసన గావించి
పురుషోత్తమునిఁజేర్చు - పుణ్యుఁడీవె

గీ॥ అచల జనకుని కడకును - నాత్మ పుత్రుఁ
బంపు విధమునుఁ దెల్పిన - బ్రహ్మమీవె
శుద్ధనిర్గుణ పరమాత్మ - సూరివినుత
కరుణనేలుము సుబ్బరా - డ్గురువరేణ్యా ॥ 23

శా॥ సేవాప్రీతుఁడవై నిరంతరము ల - క్ష్మీనాథ చిత్తుండవై
భ్రూవిన్యాస విలాస లోచనుఁడవై - మోక్షంబు సూచించి పెం
ద్రోవం జూపితి దేశికోత్తముఁడనా - తోరంపుఁ బుణ్యంబునన్
దేవా ! నీదు పదారవిందముల భ - క్తిన్ గొల్వ లోటుండునే ॥

మ॥ జనులెల్లం దలలూచి మెచ్చఁదగు నీ - సద్బోధ నాంశంబులన్
వినఁగా నెంతటి క్రూరకర్ముఁ డయినన్ - వేవేగ సన్మార్గముం
గని వర్తింపఁగఁ జూచుగాక మదిలోఁ - గౌర్వ్యంబు నూహింపఁడో
యనఘా! నీ పయిగాలి సోకినను శ్రే - యంబేను సద్దేశికా ॥ 25

ఉ॥ మానవమాత్రుగాఁ దలచి - మాయకులోఁబడి తెల్విలేక యే
మానితిఁగాని నీదు మహి - మంబును నీచరితంబు లేశముం
గానిన నేగునే వృథగఁ - గాలము నిప్పటిదాక దేవ! నన్
బూనికతోడఁ గావుమికఁ - బుణ్యచరిత్రుఁడ సుబ్బరాడ్గురూ ॥ 26

చ॥ చదువులయగ్గళేల పెను - శాస్త్రపుఁ జర్చల యూహలేల కో
విదులను వారి వెంటఁజన - వేడుక లేలను దీర్ఘయాత్రలన్
ముదమునఁ జేయనేల కలి - ముంగిటఁ దాండవమాడుచుండ నీ
పదములు చాలవే సకల - పాపవిముక్తికి సుబ్బరాడ్గురూ ॥ 27

ఉ॥ కాయము హేయమయ్యె గత - కాలము భక్తికి దూరమయ్యెనా
యాయువు తగ్గిపోయె సుఖ - మందినదంతయు భ్రాంతియయ్యె నీ
సాయముగోరినాడ ఘన - సంసృతి బంధములెల్లఁ బాపఁగాఁ
బాయని ప్రేమఁ గావుమికఁ - బండితశేఖర సుబ్బరాడ్గురూ ॥ 28

ఉ॥ దేహ మశాశ్వతంబెయిక - దీనిని నమ్మినముక్తి లేదు సం
దేహము లేల శిష్య! యని - తెల్లము సేయుచు యోగనాటక
వ్యూహపు సూత్రధారివయి - యుర్విళులూరుచు దైవనిష్ఠతో
సోహపునాంది గీతమును - సొంపుగఁ బాడితివయ్య సద్గురూ ॥ 29

గీ॥ సారహీనంపు సంసార - సాగరమున
జ్ఞానమనియెడు నోడపై - సాధుజనుల
బోధయనియెడు చుక్కాని - పొందుపఱచి
బ్రహ్మయాత్రను జేయించు - ప్రభుఁడవీవ ॥ 30

Scanned with CamScanner

—: చంపకమాల :—

చ॥ సరసవచః ప్రభావ ! భవ - సాగరతారక మౌనిచంద్ర ! శ్రీ
కరగుణజాల ! లోకహిత - కారణ ! బ్రాహ్మణ పారిజాత ! మే
దురమగుభక్తి డోలికలఁ - దూగుచు సుందర కాండ శ్రద్ధతో
మరువక పూజసల్పుచు ర - మాపతి రాముని నమ్మియుండగాఁ
బరమ పవిత్రమూర్తియగు - పావని దర్శనమిచ్చి చూప నీ
చరణము లభ్యమయ్యెనని - సంతసమందితి దేవదేవ ! నా
దరమున నన్నుఁజూచి గురు - తత్త్వమహత్త్వములెల్లఁ దెల్పఁగాఁ
గరుణనుజూపి శిష్యునిగఁ - గైకొని పుత్రునికంటె నెక్కుడౌ
స్థిరమగు ప్రేమఁజూపుచును - జిత్తము నందున నించుకేనియుం
బరునిగనెంచఁబోక బహు - భంగుల రాముని జేరు మార్గముల్
కరుణను బోధచేసితిరి - గాదె మహాత్మ ! భవత్పదంబులన్
స్థిరమగు నాదు డెందమునఁ జింతలువీడి యహర్నిశల్ సదా
మురిపెముతోడఁ గొల్తునికఁ - బుణ్యములెల్లను బండిరాశియై
వరమగు నీదు రూపమున - వచ్చెనటంచును సంతసింతునో
పరమదయార్ద్రచిత్త ! భవ - బంధన నాశనహేతు భూత ! సం
సరణము జోలియేల యిక - సారపదార్థము దక్కెనాకు నీ
వరమె యనంతమయ్యె నన - వద్య చరిత్రుడ వీవెగాదె ! భూ
సురగణ పూజితాంఘ్రి ! నినుఁ - జూచుటకంటెను బుణ్యమేది యీ
ధరఁగల దీర్థయాత్రలను - దాల్మినిఁ జేసిన ధర్మకార్యముల్
వరుసగఁ జేయనేర్చినను - వాస్తవ కర్మలఁ బూర్తిఁజేయ నీ
సరియని చెప్పఁజాలు ఘన - సాహసుఁడెవ్వఁడు సృష్టిలోన శం
కరుఁడోకో ! విష్ణుఁడోకో ! - కంజదళోద్భవుడో యటంచు నా

దరమునఁ గొందఱందురిల - దైవసముండను నాహచేత భూ
భరణముఁ బాపి ధర్మమును - బాలనసేయ నఖండుఁ డెవ్వఁడో
వరగుణ దేవధారియయి - వచ్చె నటంచును గొందఱిట్లనిన్
బరమసువాక్ప్రసూనములఁ - బ్రస్తుతిఁ జేతురుగాని బ్రహ్మమే
ధరఁ దనమాయ గూడి యవ - తారమునంది మహేంద్రవాడలో
స్థిరమగురీతి నాశ్రమముఁ - దీరిచి బ్రహ్మముఁ జేరుమార్గముల్
నరులకు బోధసేయగను - నవ్యగురుండయి పుట్టెనంచు నే
స్థిరముగఁ జెప్పఁజాలుదును - సేవలుసేయగ శక్తిలేమి యా
దరణముఁ జేయనేడు గురు - దక్షిణగా మదినెంచి భక్తితో
సరగునఁ బ్రోవనీకు నొక - చంపకమాల బహూకరించెదన్ ॥ 31

గీ॥ మంగళము దేవవందిత - మంగళంబు
మంగళము భక్తవత్సల - మంగళంబు
మహిత శ్రీరామ సహచర - మంగళంబు
మమ్ముఁ గృపఁజూడు గురుదేవ - మంగళంబు ॥ 32

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి కరుణా కటాక్ష లబ్ధ కవితావిశేష
భారద్వాజ సగోత్ర పవిత్ర లింగాల వెంకన్నశర్మ మంగ
మాంబా పుత్ర సూర్యనారాయణ ప్రణీతంబైన
శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి స్తవరాజము
సంపూర్ణము.

---

## శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి 107 వ జయంతి సందర్భమున సమర్పించిన పద్యమణిహారము.

శా॥ బ్రహ్మజ్ఞానము పామరప్రజకు దుర్గ్రాహ్యంబుగానుండ
బ్రహ్మయ్యాత్మజు రూపమై దురిత సంబంధంబు ఛేదింపగా
బ్రహ్మాత్మా! భువికేగుదెంచితిరి శ్రీరామున్ భజింపంగ సు
బ్రహ్మణ్యా! గురువర్య! గైకొనుడివే! భక్తిప్రణామంబులన్ ॥ 1

సీ॥ బాలప్రాయమునాడు - పాపయార్యులచెంత
వినతితో నేర్చిన - విద్యనెల్ల
శ్రీ విశ్వనాథుల - చెంత మీరెఱిగిన
సకలోపనిషదర్థ - సారమెల్ల
సాధనాభ్యాసంపు - సరణిచేఁ గైకొన్న
యోగానుభవలబ్ధ - యుక్తులెల్ల
నిజశక్తిచే రాఁగ - నెఱిగొన్న యనుభవ
సిద్ధమాహాత్మ్య వి - శేషమెల్ల

గీ॥ చిఱునగవుతోడఁ గూర్చుండి - శిష్యులకును
నలతి యలతిగ బోధించి - యలవరించి
తన్మయత్వంబు గల్గించు - తపసులగుట
నిజగురులు కాదె! మీరు స - మాజమునకు ॥ 2

సీ॥ శ్రీ రాజరాజేశ్వరీ - నిత్యసందర్శనా
నందమగ్న మ - హాతపస్వి
సీతామనోహార - చింతనామృతమత్త
చిత్తైకరంజిత - చిద్విలాస

పూజిత దేవతా - మూర్తి సమన్విత
సదమల సాన్నిధ్య - సత్ప్రభావ
సర్వజగచ్ఛ్రుష్టి - సౌభాగ్య గర్వకా
రణ! జగదేకశ - రణ్యామూర్తి

గీ॥ సర్వభూతాంతరావాస - శాంతిదాత
మునిజన సరోవరాంతర - ముఖ్యపీఠ
శాశ్వతానంద పథవర్తి - చక్రవర్తి
రాజితానంతగుణ! ముని - రాజచంద్ర ॥ 3

శా॥ స్వామీ! ముక్తతనూవిలాస! సుమనస్సామ్రాజ్య! విజ్ఞానతే
జోమార్తాండ! సుహృద్వరేణ్య! మునిరాట్చూడామణీదివ్య శ్రీ
రామోపాస్య! ప్రదీప్త నిశ్చలతపో రాశీ! జగన్మంగళా
శ్రీ మాహేంద్ర పురీనివాస! త్రిజగల్లీలా! వినోదాత్మకా ॥ 4

ఉ॥ మీ శుభమూర్తి దర్శనమమేయ సుఖప్రదమౌను, మీదుది
వ్యాళు సుధా ప్రవాహములు పాపహరంబులు శాంతిబోధముల్
దేశిక! మీ కృపాబ్ధి భవదృక్కులు వేదప్రమాణ బీజముల్
కాశికతీర్థమేల ప్రభు! కావగ మీరిటనుండ మాకిలన్ ॥ 5

రచయిత: మునుకుట్ల శేషాద్రిశాస్త్రి B. E.

శ్రీరామక్షేత్రము,
మహేంద్రవాడ.
12—6—67.

శ్రీ సుభద్రా వెంకటసూర్యనారాయణ
పరబ్రహ్మంగార్ల సన్మానవేదిక.